సాక్షి
వికారాబాద్
గురువారం । 17 । జూలై । 2025



రైతుకు శాపం

వర్షాభావ పరిస్థితులు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. విత్తు వేసి ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. 8లో▸



గ్రామీణ రోడ్లకు మహర్దశ

మహిళల ఆర్థిక ఎదుగుదలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



సర్కారు బడుల్లో ఇంటర్నెట్

ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. 9లో▸

13,921

కొత్త రేషన్ కార్డులు



మరో 55,436 మందికి పాత కార్డుల్లో చోటు

- నేటి నుంచి ప్రొసీడింగ్స్ అందజేత
- జిల్లాలో మొత్తం రేషన్ కార్డులు 2,48,475
- లబ్ధిదారులు 8,52,122 మంది
- ప్రతి నెలా 5,782 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ

వికారాబాద్: పేదలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల కల ఎట్టకేలకు సాకారం కానుంది. ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు, నిరుపేదలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకుంటోంది. సన్నబియ్యం పంపిణీతో ముందడుగు వేసింది. దశాబ్దాలుగా పేరుకుపోయిన ఫిర్యాదులకు పరిష్కారం చూపుతోంది. గతంలో రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసే దొడ్డు బియ్యాన్ని ప్రజలు తినేవారు కాదు. కొందరు కిరాణా దుకాణాల్లో విక్రయించే వారు.. మరి కొందరు తీసుకెళ్లే వారు కాదు. ఎక్కువగా బ్లాక్ మార్కెట్ జరిగేది.. సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభించిన నాటి నుంచి లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు క్యూ కడుతున్నారు. అక్రమాలకు చెక్ పడిందనే చెప్పాలి. దీంతో ప్రభుత్వ లక్ష్యం పూర్తిగా నెరవేరుతోంది. కార్డుల్లో సభ్యుల చేరిక కోసం పదిహేను సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారు. ఈ దరఖాస్తులకు సైతం మోక్షం లభించింది. ప్రస్తుతం అర్జీ పెట్టుకున్న వారి పేర్లను పాత రేషన్ కార్డుల్లో చేర్చారు. కొత్త కార్డులు, కొత్త సభ్యులకు అదనపు కోటా విడుదల చేస్తున్నారు. జిల్లాకు కొత్తగా మంజూరైన కార్డులను నేటి నుంచి(16వ తేదీ) లబ్ధిదారులకు అందజేయనున్నారు. ప్రొసీడింగ్ పత్రాలు అందజేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి స్పీకర్, ఎమ్మెల్యేల చేతుల మీదుగా పత్రాలు ఇవ్వనున్నారు.

వేల మందికి లబ్ధి

కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక ప్రజాపాలన కార్యక్రమం ద్వారా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించింది. దాదాపు 15వేల మందికి పైగా అర్జీలు పెట్టుకున్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు అర్హుల జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. దీంతో 13,921 కార్డులు మంజూరయ్యాయి. వీటితో పాటు పాత కార్డుల్లో సభ్యులను చేర్చే ప్రక్రియను పూర్తి చేశారు. 17,563 కుటుంబాలకు చెందిన వారు కొత్త సభ్యుల చేరిక కోసం దరఖాస్తు చేసుకోగా 55,436 మందికి ప్రభుత్వం లబ్ధి చేకూరేలా నిర్ణయం తీసుకుంది.

2,48,475కి చేరిన కార్డుల సంఖ్య

జిల్లా వ్యాప్తంగా 588 రేషన్ దుకాణాలు ఉండగా 2,48,475 కార్డులు, 8,52,122 మంది సభ్యులు ఉన్నారు. ప్రతి నెలా ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున 5,782 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ పంపిణీ చేస్తోంది. కొత్త కార్డులు, కొత్త సభ్యుల చేరికతో 600 పై చిలుకు మెట్రిక్ టన్నుల కోటా పెరిగింది. దొడ్డు రకం బియ్యం పంపిణీ చేసే సమయంలో 80శాతం మంది లబ్ధి పొందేవారు. సన్నబియ్యం పంపిణీ చేసిన నాటి నుంచి ఐదు శాతం మంది అధికంగా బియ్యం తీసుకెళ్తున్నారు.

మండలాల వారీగా మంజూరైన రేషన్ కార్డులు, లబ్ధిదారుల సంఖ్య

మండలం పేరు	కార్డులు	సభ్యులు
బంట్వారం	742	2,339
మోమిన్‌పేట్	89	749
ధారూరు	452	1,499
మర్పల్లి	75	457
కోట్‌పల్లి	476	1,724
వికారాబాద్	674	3,460
కుల్కచర్ల	1,552	5,070
దోమ	1,250	4,748
పరిగి	1,355	4,618
పూడూరు	492	3,023
బొంరాస్‌పేట్	1,412	4,592
కొడంగల్	509	2,416
దౌల్తాబాద్	239	1,237
బషీరాబాద్	276	1,767
పెద్దేముల్	1,215	4,003
యాలాల	819	3,227
తాండూరు	2,229	10,280
నవాబుపేట	65	227

నేటి నుంచి పత్రాల పంపిణీ



జిల్లాలో కొత్తగా రేషన్ కార్డులు మంజూరైన వారికి గురువారం నుంచి ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తాం. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం సాగుతుంది. కార్డులు లేని వారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలి. అర్హులైన వారికి మంజూరు చేస్తాం.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్

న్యూస్‌రీల్

రేపు ఇందిరా మహిళా శక్తి సంబరాలు

తాండూరు రూరల్: ఇందిరా మహిళా శక్తి నియోజకవర్గ స్థాయి సంబరాలు శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్(డీపీఎం) శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల సభ్యులతో ఈ నెల 18న పట్టణంలోని తులసీ గార్డెన్‌లో సంబరాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, డీఆర్‌డీఓ శ్రీనివాస్ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా 450 సంఘాలకు రూ.7 కోట్లు విలువ చేసే వడ్డీ రాయితీ చెక్కులు అందజేస్తారని పేర్కొన్నారు.

బీజేపీ ఎన్నికల జిల్లా కన్వీనర్‌గా బాలేశ్వర్‌గుప్తా



యాలాల: బీజేపీ జిల్లా ఎన్నికల కన్వీనర్‌గా మండల మాజీ ఎంపీపీ,పార్టీ సీనియర్ నాయకుడు బాలేశ్వర్ గుప్తాను నియమించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి



ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న సురేంద్రనాథ్

దౌల్తాబాద్: ఆయిల్ పామ్ సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ అధికారి సురేంద్రనాథ్, జిల్లా సెరికల్చర్ శాఖ అధికారి సత్తార్ అన్నారు. బుధవారం మండలంలోని దేవర్‌ఫసల్‌వాద్ గ్రామ రైతు వేదికలో ఆయా గ్రామాల అన్నదాతలకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ రంగనాయకులు మాట్లాడుతూ.. రైతులు లాభాలు వచ్చే పంటలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఈకో ఫాం కంపెనీ ప్రతినిధి భరత్, మాజీ సర్పంచ్ వెంకట్‌రాములు, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

అనంతగిరి: బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో ఎంబీసీ యువతి, యువకులకు వివిధ నైపుణ్యాలకు (స్కిల్ డెవెలప్‌మెంట్) సంబంధించిన కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి ఉపేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కేంద్రం హైదరాబాద్‌లో ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో ఉచిత రవాణా అలవెన్స్, వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన ఫారాన్ని 22వ తేదీ సాయంత్రం 5గంటల లోపు కలెక్టరేట్‌లోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో సమర్పించాలని ఆయన తెలిపారు.

భూముల వద్దే వంటావార్పు

పదో రోజుకు చేరిన ఎనికేపల్లి రైతుల రిలే దీక్ష



ఎనికేపల్లి భూముల వద్ద మహిళా రైతుల వంటావార్పు

మొయినాబాద్: తమకు న్యాయం చేయాలంటూ ఎనికేపల్లి రైతులు చేపడుతున్న రిలే దీక్ష బుధవారం 10వ రోజు కొనసాగింది. మున్సిపల్ పరిధి ఎనికేపల్లిలో సర్వేనెంబర్ 180లోని 99.14 ఎకరాల భూమిని ప్రభుత్వం గోశాలకు కేటాయించడంతో ఆ భూములు సాగుచేసుకుంటున్న రైతులు రిలే దీక్ష చేపడుతున్నారు. కొందరు రైతులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మంగళవారం పరిహారంగా ఎకరాకు 300 గజాల చొప్పున పట్టాలు అందజేశారు. మిగిలిన రైతులు దీక్షను కొనసాగిస్తున్నారు. బుధవారం భూముల వద్దనే వంటావార్పు చేసి నిరసన తెలిపారు. వారికి మద్దతుగా బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఇతర నాయకులు దీక్షలో కూర్చున్నారు.

విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యం వద్దు

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- దోమ కేజీబీవీ, ఎస్సీ హాస్టల్ ఆకస్మిక తనిఖీ

దోమ: విద్యార్థుల పట్ల స్పెషల్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ప్రతీక్ జైన్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, ఎస్సీ హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కస్తూర్బాగాంధీ పాఠశాల పరిసరాలు, వంట గది, తరగతి గదులు, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. సౌకర్యాలు బాగున్నాయా? మంచినీరు అందుతోందా..? మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం సరిగ్గా లేకపోవడంతో ఇన్‌చార్జ్ ఎస్‌ఓ గీతాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం ఇలానే ఉంటుందా? అని అసహనం వ్యక్తం చేశారు. వారంలో రెండు సార్లు పాఠశాలను సందర్శించి భోజనం చేయాలని, సరిగ్గా లేకుంటే తమ దృష్టికి తేవాలని ఎంపీడీఓ గ్యామా, ఎంఈఓ వెంకట్‌కు సూచించారు. అనంతరం ఎస్సీ హాస్టల్‌ను సందర్శించి పరిసరాలు, వంట గది, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోవిందమ్మ, హాస్టల్ వార్డెన్ ప్రవీణ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సాధించాలి

కుల్కచర్ల: విద్యార్థులు ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సాధించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం కుల్కచర్లలోని గిరిజన బాలుర వసతి గృహం, కేజీబీవీ, తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మొదట్లో ఇంగ్లిష్‌లో మాట్లాడటంలో కొంత ఇబ్బంది ఉంటుందని రానురాను అలవాటైపోతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంఈఓ అబీబ్ అహ్మద్, ఏపీఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారులు



డీఈఓ రేణుకాదేవితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

మర్పల్లి: కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆరోపించారు. మండలంలోని సిరిపురం కేజీబీవీలో విద్యార్థులకు నాణ్యత లేని భోజనం వడ్డిస్తున్న విషయం తెలుసుకున్న ఆయన బుధవారం విద్యాలయానికి వచ్చారు. అప్పటికే డీఈఓ రేణుకాదేవి పాఠశాలలో ఉన్నారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు తాను వచ్చానని గేటు తీయాలని ఆనంద్ డీఈఓను కోరారు. మీరు పాఠశాలలోకి రావొద్దని ఎస్‌ఓను గేటు వద్దకు పంపుతానని డీఈఓ తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వస్తే స్కూల్‌లోకి పంపుతారు తమనెందుకు పంపరని ఆనంద్ నిలదీశారు. దీంతో గేటు తీసి పాఠశాలలోకి తీసుకెళ్లారు. అనంతరం ఆయన విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మధుకర్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, పార్టీ శ్రేణులు గఫార్, శ్రీకాంత్, గౌస్, శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా జాతీయ రహదారి పనులు

పర్సాపూర్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా చెట్ల తొలగింపు



పర్సాపూర్ సమీపంలో చెట్లను తొలగిస్తున్న కూలీలు

కొడంగల్: మహబూబ్‌నగర్ – చించోలీ జాతీయ రహదారి పనుల్లో భాగంగా బుధవారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను తొలగించారు. మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం అంతర్రాష్ట్ర రహదారిని నేషనల్ హైవేగా మార్చింది. మొదటి విడతలో మహబూబ్‌నగర్ నుంచి దుద్యాల్ గేటు వరకు పనులు నిర్వహించారు. రెండో విడతలో దుద్యాల్ గేటు నుంచి తాండూరు మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు పనులు చేపట్టాల్సి ఉంది. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. కొడంగల్ మండలం హస్నాబాద్ నుంచి పర్సాపూర్ సమీపంలోని చెట్లను తొలగించారు. జాతీయ రహదారి పనులను వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. చెట్ల తొలగింపు పనులతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి కర్ణాటక రాష్ట్రం చించోలీ వరకు జాతీయ రహదారి ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం గతంలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి 167 ఎన్‌హెచ్‌గా పేరు పెట్టారు. మహబూబ్‌నగర్ నుంచి హన్వాడ, గండీడ్, కోస్గి, కొడంగల్, తాండూరు మీదుగా ఈ రహదారిని నిర్మిస్తున్నారు. బెంగళూరు, ముంబై జాతీయ రహదారులను కలిపే ఈ మార్గం సుమారు 150 కిలోమీటర్లు పొడవు ఉంటుంది. మన జిల్లాలో 45 కిలోమీటర్లు, కర్ణాటక రాష్ట్రంలో 50 కిలో మీటర్లు, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 55 కిలోమీటర్ల మేర రహదారి విస్తరించి ఉంది. జాతీయ రహదారి అందుబాటులోకి వస్తే మూడు జిల్లాల పరిధిలో రవాణా వ్యవస్థ కూడా మెరుగు పడుతుంది.

కళాశాలల్లో అడ్మిషన్లు పెంచండి

ఇంటర్మీడియట్ బోర్డ్ జాయింట్ సెక్రటరీ జ్యోత్స్నారాణి



ప్రిన్సిపాళ్లతో మాట్లాడుతున్న జ్యోత్స్నారాణి

అనంతగిరి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఇంటర్మీడియట్ బోర్డ్ జాయింట్ సెక్రటరీ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్పెషల్ ఆఫీసర్ డా. జ్యోత్స్నా రాణి అన్నారు. బుధవారం వికారాబాద్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటర్ విద్య కమిషనర్ ఆదేశాల ప్రకారం ప్రతి కళాశాలలో అడ్మిషన్లు పెంచేందుకు ప్రిన్సిపాళ్లు, సిబ్బంది కృషి చేయాలన్నారు. కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ ద్వారా విద్యార్థులకు ఎంసెట్, నీట్, జేఈఈ పరీక్షల కోసం ఆన్‌లైన్ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కళాశాలల్లో వివిధ మరమ్మతు పనుల కోసం నిధులు కేటాయిస్తున్నట్లు వివరించారు. జిల్లాకు కొత్త వచ్చిన ప్రిన్సిపాళ్లు రోజారాణి, వసంత, రమణ కుమారిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రూపాలక్ష్మి, నర్సింహారెడ్డి, కుమారస్వామి, బుచ్చిరెడ్డి, సురేశ్వరస్వామి, వెంకటేశ్వర్‌రావు, మల్లినాథప్ప, పండరి, మక్బుల్, ఆఫీస్ సిబ్బంది వినోద్, సలీమా బేగం, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన నరేశ్ మహరాజ్



కుమారస్వామితో నరేశ్ మహరాజ్

తాండూరు: కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని బుధవారం బీజేపీ సీనియర్ నాయకుడు నరేశ్ మహరాజ్ ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయకీయాలపై చర్చించారు. నావాంద్గీ రైల్వే స్టేషన్‌లో హుబ్లీ ఎక్స్‌ప్రెస్ నిలిపేలా చూడాలని మంత్రిని కోరారు. ఈ విషయమై కేంద్ర రైల్వే శాఖ మంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

కూరగాయల ధరలు పైపైకి



కొడంగల్: కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరగడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. పచ్చి మిర్చి కిలో రూ.80కి చేరింది, క్యాప్సికం కిలో రూ.80, బీర కాయలు రూ.80, చిక్కుడు, గోరు చిక్కుడు రూ.80, టమాటా రూ.40, బెండ రూ.40, ఆలుగడ్డ రూ.40కి చేరింది. ఏమి కొనాలన్నా కిలో రూ.80 పైనే అని మహిళలు వాపోతున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా కూరగాయల దిగుబడి తగ్గింది. కష్టపడి సాగు చేసిన రైతులకు గిట్టుబాటు కావడం లేదు. అంతేకాకుండా దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు పెంచేస్తున్నారు. రైతుల దగ్గర తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో సామాన్యులకు ఆర్థిక భారం తప్పడం లేదు.

జిల్లా రెవెన్యూ అధికారిగా మంగిలాల్

అనంతగిరి: జిల్లా రెవెన్యూ అధికారిగా ఎం మంగిలాల్‌ను ప్రభుత్వం నియమించింది. వరంగల్‌లో డిప్యూటీ కలెక్టర్ హోదాలో పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. వారం రోజుల క్రితం వికారాబాద్ డీఆర్‌ఓగా నియమితులైన పి.చంద్రయ్యకు ప్రమోషన్ రావడంతో ఆయన స్థానంలో మంగిలాల్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. చంద్రయ్యను ప్రభుత్వం మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)గా బదిలీ చేసింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎన్నిక ఏదైనా.. గెలుపు బీఆర్‌ఎస్‌దే ఉండాలి

- మాజీ మంత్రి సబితారెడ్డి
- జన్వాడలో శంకర్‌పల్లి ముఖ్యనాయకుల సమావేశం

శంకర్‌పల్లి: రాష్ట్రంలో ఏఎన్నిక వచ్చినా గెలుపు బీఆర్‌ఎస్‌దే ఉండాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం శంకర్‌పల్లి మండలం జన్వాడలో మండల ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సబితారెడ్డి మాట్లాడుతూ.. నాయకులెవరైనా ప్రతిపక్షంలో ఉన్నప్పుడే రాజకీయంగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలని, ఏ క్షణంలోనైనా నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందన్నారు. నాయకులు పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేసుకుని, రోజు మూడు నుంచి నాలుగు గ్రామాల్లో పర్యటించేలా రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలన్నారు. యువతను పార్టీలో భాగస్వామ్యం చేయాలని, పార్టీలో కొత్త, పాత అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. రెండేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమి లేదని, సభలు, సమావేశాల్లో కేసీఆర్‌ని తిట్టడం తప్ప వాళ్లు ఏం లేదని ఎద్దేవా చేశారు. గతంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్‌లు సీఎంగా ఉన్నప్పుడు వర్షాలు సమృద్ధిగా కురిసాయని.. ఇప్పుడు వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణ మాఫీ, రైతు భరోసా, మహిళలకు రూ. 2,500 ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఓటమి భయంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా లేదని, చివరికి హైకోర్టు జోక్యంతో గత్యంతరం లేక, ఎన్నికలు నిర్వహించే పరిస్థితికి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేసీఆర్ జపం చేయకుండా, ప్రజలకు ఏదైనా మేలు చేసే పనులు చేయాలని కోరారు. గ్రామాలు, పట్టణాలు ఎక్కడ తిరిగినా ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్ వస్తుందని చెప్పడం సంతోషాన్ని కల్గిస్తోందన్నారు. సమావేశంలో శంకర్‌పల్లి, రాయదుర్గం పీఏసీఎస్ చైర్మన్లు శశిధర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, శంకర్‌పల్లి బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు రాజు నాయక్, వెంకటేశ్, బాలకృష్ణ, సత్యనారాయణ, నర్సింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేజీబీవీలో అడిషనల్ కలెక్టర్

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం మారెపల్లి గేటు వద్ద ఉన్న కేజీబీవీ పాఠశాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్ బుధవారం సందర్శించారు. హాస్టల్లో వంట గది, స్టోర్ రూంలను పరిశీలించారు. సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హాస్టల్లో ఉన్న ప్రతి విద్యార్థిపై శ్రద్ధ వహించాలన్నారు. వర్షాకాలం సందర్భంగా భోజన విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ తర్వాత విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి సత్యనారాయణ, ఎంపీడీఓ రతన్‌సింగ్, స్పెషలాఫీసర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కల్లు దుకాణంలో తనిఖీ



కల్లు శాంపిల్స్ సేకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ధారూరు: మండల కేంద్రంలోని రాములుగౌడ్ కల్లు దుకాణాన్ని బుధవారం ఎక్సైజ్ శాఖ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణంలో విక్రయిస్తున్న కల్లు శాంపిల్స్‌ను సేకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. 10 నుంచి 15 రోజుల కల్లు నిల్వ ఉంచరాదని, దానిలో నిషేధిత మత్తు పదార్థాలను కలుపరాదని సూచించారు. కలుషిత నీరు కల్లులో వాడరాదని, స్వచ్ఛమైన నీటినే వాడాలన్నారు. కల్లు దుకాణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో తాండూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

ఎక్సైజ్ సోదాలు

తాండూరు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం కల్లు తయారీలో ప్రమాణాలు పాటించాలని ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎక్సైజ్ ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాస్, అధికారులతో కలిసి బుధవారం ఆయన పట్టణంలోని కల్లు దుకాణాన్ని తనిఖీ చేశారు. కల్లు సీసాలు శుభ్రంగా లేకపోవడంపై అసహనం వ్యక్తంచేశారు. అనంతరం కల్లు శాంపుల్స్ సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నిజామొద్దీన్, సిబ్బంది భీమయ్య, రవికిశోర్, రవికిరణ్, హనుమంతు తదితరులు ఉన్నారు.

భవిష్యత్ అంతా బాలికలదే

తాండూరు తహసీల్దార్ తారాసింగ్



వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్: రాబోయే రోజుల్లో భవిష్యత్ అంతా బాలికలదేనని తహసీల్దార్ కేతావత్ తారాసింగ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెన్‌గేస్‌పూర్ మార్గంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. వంట గదిని పరిశీలించి సామగ్రిని పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆ తర్వాత విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. బాలికలు చదువుకు దూరం కావొద్దనే ఉద్దేశంతోనే ప్రభుత్వాలు ప్రత్యేక గురుకుల వసతి గృహాలు ఏర్పాటు చేశారన్నారు. హాస్టల్‌లో ఉంటూ కష్టపడి చదవి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్లో ఉంటున్న పిల్లలను కంటికి రెప్పలా చూసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. బాలికల విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివగీత, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

పశువులు తరలిస్తున్న కంటైనర్ సీజ్

కడ్తాల్: అక్రమంగా పశువులను తరలిస్తున్న కంటైనర్‌ను పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. విజయవాడ నుంచి ఓ కంటైనర్‌లో అనుమతి లేకుండా హైదరాబాద్‌కు పశువులు తరలిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు కడ్తాల్ సమీపంలో వాహనాన్ని తనిఖీ చేశారు. కంటైనర్‌లో 64 ఆవులు, 41 ఎద్దులు ఉన్నట్లు గుర్తించారు. ఇరుకు స్థలంలో ఊపిరాడక 4ఆవులు మృతిచెందాయన్నారు. పశువులను జియాగూడ కామధేను సమర్థ గోశాలకు తరలించారు.

కలిసిరాని కాలం.. రైతుకు శాపం

కాలం కలిసి రాక అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సీజన్ ప్రారంభమైనా సరైన వానలు కురవకపోవడంతో రైతన్నలు దిగాలుగా ఆకాశం వైపు చూడసాగారు. జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంటల సాగుకు అంతరాయం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

- సరిపడా వర్షాలు లేక ఆందోళనలో కర్షకులు
- గణనీయంగా తగ్గిన వర్షపాతం
- పంటలు ఎండిపోతున్నాయని గగ్గోలు



నందారంలో ఎండిపోతున్న పత్తిపంట

దౌల్తాబాద్: వానాకాలం సాగును వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. కొద్ది రోజుల క్రితం కురిసిన మోస్తరు వర్షంతో అన్నదాతల ఆశలు చిగురించాయి. మండల వ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో అత్యధికంగా కురవగా కొన్నింటిలో తక్కువ వర్షపాతం కురిసినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. అన్ని గ్రామాల్లో అనుకున్న మేర వానలు కురవలేదు. అడపాదడపా కురుస్తున్న జల్లులకు పత్తి పంటకు జీవం పోస్తున్నాయి. కానీ నారుమడులు పోసిన రైతులు చెరువులు నిండకపోవడంతో సాగు ప్రశ్నార్థకమవుతోందని ఆందోళన చెందుతున్నారు. కరెంటు బావుల వద్ద ఉన్న ప్రాంతాల్లో మాత్రం నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. నారుమళ్లలో నారు పోసి సుమారు 15 నుంచి 20 రోజులు కావస్తుండడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది రైతులకు సబ్సిడీ ద్వారా జీలుగ, జనుము విత్తనాలను సరఫరా చేశారు. భారీ వర్షాలు కురిస్తే పంటలు సాగయ్యే అవకాశముందని వ్యవసాయ నిపుణులు అంటున్నారు. మండలంలో జూన్ నెలలో 114.2 సాధారణ వర్షపాతంకుగాను 83.6, జూలై నెలలో 184.3కిగాను 60.9 వర్షపాతం నమోదైంది.

మబ్బులు చూస్తున్నాం



నారుమడులు ఎండిపోతున్నాయి. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవక ఆందోళన చెందుతున్నా. కరిగెట చేసి 10 రోజులవుతుంది. నారుమడులు వచ్చాయి. నాటు వేసే దశకు వచ్చినా మబ్బులు చూడాల్సిన దుస్థితి దాపురించింది.

– జనార్దన్‌రెడ్డి, రైతు, నందారం

వరుణుడా.. కరుణించవా!

ధారూరు: వానాకాలం పంటల సాగులో భాగంగా కంది, పెసర, మినుము, పత్తి, మొక్కజొన్న తదితర పంటలను మండల వ్యాప్తంగా కర్షకులు సాగుచేశారు. ఎదుగుతున్న మొక్కలకు వరుణుడి కరుణ లేకపోవడంతో వాడిపోతున్నాయి. సకాలంలో సరైన వానలు లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రూ.వేలకు వేలు వ్యయం చేసి వేసిన పంటలన్నీ మొలకెత్తే దశలో ఉన్నాయి. కానీ సరిపడా వర్షాలు లేక వాటి ఎదుగుదల మందగించింది. మండలంలో దాదాపు 30 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. నిత్యం వరుణుని కోసం రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. మేఘాలు కమ్ముకున్న వాన పడకపోవడంతో పరిస్థితి దయనీయంగా తయారైంది. అవసరం లేనప్పుడు కుంభవృష్టి, అవసరమున్నప్పుడు అనావృష్టి తాండవిస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వానలు కురుస్తేనే తమ మనుగడ సాధ్యమని, లేకుంటే ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధలు వెంటాడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.



స్టేషన్‌ధారూరులో నీరు లేక వాడిపోతున్న పెసర పంట

పీచు మిఠాయి.. వెనక గంజాయి!



చాక్లెట్లతో నిందితుడు దినేష్ నాయక్



దినేష్ నాయక్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

తాండూరు టౌన్: పీచు మిఠాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి పోలీసులు గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈఘటన వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో బుధవారం వెలుగు చూసింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలువురు వ్యక్తులు పట్టణంలో కొన్ని రోజులుగా పీచు మిఠాయి విక్రయిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా అనుమానం వచ్చిన పోలీసులు దినేష్‌నాయక్ అనే వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద 45 గంజాయి చాక్లెట్లు లభించాయి. అతన్ని అదుపులోకి తీసుకుని, గంజాయి చాక్లెట్లు ఎక్కడి నుంచి వచ్చాయి..? ఎక్కడెక్కడ వీటిని విక్రయిస్తున్నారు..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. దినేశ్‌నాయక్ పట్టుబట్టాడనే విషయం తెలుసుకున్న మరో నలుగురు పరారీ అయినట్లు తెలిసింది.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- రూ.20 కోట్లతో లాల్‌పహాడ్ – అంగడి చిట్టంపల్లి రహదారి పనులు ప్రారంభం



పూడూరు: రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఇందిరా మహిళా శక్తి సంబరాలు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు వడ్డీ మాఫీ కింద ప్రభుత్వం రూ.1.19 లక్షలు విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలోని కోటి మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. మహిళలను వ్యాపార రంగంలో ప్రోత్సహించి వారికి వడ్డీ లేని రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు

పూడూరు: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి గ్రామీణ రోడ్లకు ప్రాధాన్యత ఇస్తున్నారని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి చెప్పారు. బుధవారం మండల పరిధిలోని అంగడి చిట్టంపల్లి–లాల్‌పహాడ్ వరకు రూ.20 కోట్లతో నిర్మిస్తున్న డబుల్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 18 నెలల్లో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు ప్రతి పల్లెకు బీటీ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు నిర్మాణంతో పాటు పరిగి–షాద్‌నగర్ వరకు, పరిగి నుంచి వికారాబాద్ వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకున్నామని ప్రకటించారు. మన్నెగూడ నుంచి నాగర్‌గూడ వరకు డబుల్ రోడ్డు మంజూరయిందని తెలిపారు. పూడూరు గేటు నుంచి మండల కేంద్రం వరకు డబుల్ రోడ్డు పనులను త్వరలో పూర్తి చేసేలా అధికారులను ఆదేశించామని చెప్పారు. గత ప్రభుత్వం ఒక్క ఇల్లు, రేషన్‌కార్డు ఇచ్చిన పాపాన పోలేదని ఆరోపించారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేరుస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రఘురాథ్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, శ్రీనివాస్, అజీంపటేల్, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు లాల్‌కృష్ణ, వీరేష్, సురేష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమి స్వాధీనం

- 25 ఎకరాల్లో 11,110 మొక్కలు నాటిన అధికారులు
- ఆక్రమణలకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



నాటిన మొక్కలను పరిశీలిస్తున్న ఎఫ్‌ఆర్‌ఓ రాజేందర్, అధికారులు

ధారూరు: ఆక్రమణకు గురైన అటవీ భూమిలో బుధవారం ఆ శాఖ అధికారులు మొక్కలు నాటారు. ధారూరు ఫారెస్టు రేంజర్ బి.రాజేందర్ అధ్వర్యంలో డిప్యూటీ ఫారెస్టు రేంజర్ హేమ, సెక్షన్, బీట్ ఆఫాసర్లు, సిబ్బంది కలిసి అల్లనేరేడు, వేప, నెమలినార, కానుగ, ఉసిరి, తెల్లమద్ది, సీతాఫల్ తదితర 11,110 మొక్కలు నాటి, సపోర్ట్ కర్రలు పాతించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌ఓ రాజేందర్ మాట్లాడుతూ.. ఫారెస్ట్ భూముల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. పట్టాదారు పాసుపుస్తకాల్లో ఉన్న విస్తీర్ణానికి మించి గజం స్థలాన్ని ఆక్రమించినా చర్యలు తప్పవన్నారు. స్టేషన్‌ధారూరు సమీప అడవిలోని 98వ కంపార్ట్‌మెంట్ ఏడుకానల వద్ద గతేడాది 25 ఎకరాల్లో మొక్కలు నాటించామని తెలిపారు. మదనంతాపూర్, సంగాయపల్లితండాలకు చెందిన కొందరు 12 ఎకరాల్లోని మొక్కలను ధ్వంసం చేసి, అప్పట్లో కంది, పత్తి పంటలను సాగు చేశారని వెల్లడించారు. ఈ స్థలంలో ఈసారి కూడా కంది సాగు చేసిన విషయం తమ దృష్టికి రావడంతో భూమిని స్వాధీనం చేసుకుని ప్లాంటేషన్ చేశామని స్పష్టంచేశారు. ఫారెస్టు భూముల్లోకి వస్తున్న వారిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఎవరూ అటవీ భూముల అన్యాక్రాంతానికి పాల్పడొద్దని తెలిపారు.

సిట్ విచారణకు ఏఎంసీ చైర్మన్



బాల్‌రెడ్డి

తాండూరు టౌన్: ఫోన్ ట్యాపింగ్ కేసులో తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి బుధవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ విచారణకు హాజరయ్యారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆయన బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే గత ప్రభుత్వ హయాంలో బాల్‌రెడ్డికి చెందిన ఫోన్ నంబర్‌ను ట్యాపింగ్ చేశారని, అట్టి ఫోన్ నంబర్ తనకు చెందినదేనా లేదా అనే విషయమై వివరణాత్మక వాంగ్మూలాన్ని ఇవ్వాలని సిట్ అధికారులు నోటీసులో కోరారు. దీంతో సిట్ అధికారుల ఎదుట హాజరై తన వాంగ్మూలాన్ని ఇచ్చినట్లు బాల్‌రెడ్డి తెలిపారు.

గోపన్‌పల్లిలో డెంగీ కేసు నమోదు

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతాపూర్ అనుబంధ గ్రామం గోపన్‌పల్లిలో డెంగీ కేసు నమోదైంది. ఈ సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన అబూబాకర్ 9వ తరగతి చదువుతున్నాడు. కొద్ది రోజుల క్రితం జ్వరం రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించగా డెంగీగా నిర్ధారించారు. దీంతో జినుగుర్తి ఆస్పత్రి సిబ్బంది గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రస్తుతం బాలుడు ఆరోగ్యంగా ఉన్నాడని తెలిపారు. స్థానికంగా పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు విజృంభిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

యాగాలకు తరలిన అర్చకులు



యాగశాలలో రాష్ట్ర కార్యవర్గం సభ్యులతో జిల్లా కార్యవర్గసభ్యులు, అర్చకబృందం

కొడంగల్ రూరల్: ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీచండీ, కుబేర, పాశుపత యాగాలకు బుధవారం అర్చక బృందం సభ్యులు కొడంగల్ నుంచి హైదరాబాద్ తరలివెళ్లారు. దేశంలోనే రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు సాధించాలనే సంకల్పంతో హైదరాబాద్‌లోని తుల్జాభవన్ ధర్మశాలలో డీడీఎన్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం సభ్యులు మూడు రోజులపాటు యాగాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేదమంత్రోచ్ఛారణ, జపములతో అర్చకులు యాగం చేశారు. తెలంగాణ సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో విరాజిల్లుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతోనే ఈక్రతువు చేపట్టినట్లు స్పష్టంచేశారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి బుధవారం యాగశాలను దర్శించారని డీడీఎన్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో నటరాజ్‌స్వామి, అఖిలేష్‌స్వామి, జగదీష్, సంతోష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాన కోసం కప్ప కావడి

కడ్తాల్: వాన కోసం మండల కేంద్రంలో బుధవారం కప్ప కావడి నిర్వహించారు. ఈ సందర్భంగా కప్పకు ప్రత్యేక పూజలు చేసి, గ్రామంలో ఊరేగించారు. అనంతరం మహాదేవునికి బోనం సమర్పించారు. సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలతో రైతులు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్, సత్యనారాయణ, నాగరాజుగౌడ్, మహిళలు ఉన్నారు.

లంచం అడిగితే పట్టివ్వండి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్: ఓట్లేసి గెలిపించిన ప్రజలకు సేవకుడిలా పనిచేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తానని స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని ఎక్మాయి గ్రామంలో మొక్కలు నాటి, రూ.10 లక్షల ఫార్మేషన్ రోడ్డు పనులు, ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల మంజూరుకు అధికారులు కానీ, నాయకులు కానీ లంచాలు అడిగితే వాళ్లను తనకు పట్టివ్వాలని సూచించారు. ఎక్మాయిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు స్థానిక నేతలు డబ్బులు వసూలు చేశారని పత్రికల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో ఎమ్మెల్యే ఈ వాఖ్యలు చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అప్పటి నాయకులు కాగితాలపై జీవోలు తీసుకువచ్చి ప్రజలను మభ్యపెడితే, తాను 18 నెలల కాలంలో తీసుకొచ్చిన జీఓలన్నీ అమలు చేశానన్నారు. నాయకులు పంథాలు వీడి సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం గ్రామస్తుల నుంచి అర్జీలు తీసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, ఏఎంసీ వైస్‌చైర్మన్ చందర్‌నాయక్, తహసీల్దార్ షాహేదాబేగం, ఎంపీడీఓ విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈత వనాలతో ఆర్థికాభివృద్ధి

వనమహోత్సవంలో భాగంగా మల్కన్‌గిరి గ్రామ పరిధిలో మధుసూధన్‌గౌడ్‌కు రైతు పొలంలో ఈత చెట్లను ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నాటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈతవనాలు పెంచడంతో గీత కార్మికులు ఆర్థికాభివృద్ధి చెందుతారన్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ విజయ్‌భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈత వనాలు పెంచడంతో కల్తీ కల్లు పూర్తిగా నిరోధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సహాయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, డీసీసీబీ ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి, పీసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ చందర్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎఫ్‌ఆర్‌ఓ సరస్వతి శ్రీదేవి, సెక్షన్ అధికారి స్నేహశ్రీ, నాయకులు పాల్గొన్నారు.

బోనం.. అమ్మకు ఘనం



బొంరాస్‌పేట: బోనాల ఊరేగింపు



బొంరాస్‌పేట: బోనమెత్తిన యువతి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని రేగడిమైలారంలో ఆషాఢమాసం సందర్భంగా బుధవారం సామూహికంగా లక్ష్మమ్మ బోనాల పండుగ నిర్వహించారు. ఉదయం ఊరేగింపుగా జల్ది కార్యక్రమం చేశారు. సాయంత్రం బోనాలెత్తిన మహిళల ఊరేగింపు పోతురాజులతో బ్యాండు మేళాల నడుమ కన్నుల పండువగా సాగింది. కార్యక్రమంలో కురువ సంఘం అధ్యక్షుడు లింగప్ప, గ్రామస్తులు, తదితరులున్నారు.

దోమ : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గ్రామ దేవత పోచమ్మకు బోనాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం బొంపల్లి గ్రామంలో గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి బోనాన్ని అందంగా అలంకరించి మహిళలు ఆలయానికి బయల్దేరారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింత మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపును ప్రజలు వైభవోపేతంగా నిర్వహించారు.

వార్డుల విభజన లేనట్లే!



తాండూరు మున్సిపల్ కార్యాలయం

- తాండూరులో ఓటరు జాబితా సిద్ధం
- ఆశావహుల్లో నెలకొన్న నిరాశ
- ఎన్నికల నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు

తాండూరు: మున్సిపల్ ఎన్నికల కోసం అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఎన్నికలకు వెళ్లేందుకు రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలలో వార్డుల పునర్విభజన చేపట్టారు. అందులో భాగంగా జిల్లాలోని పరిగి మున్సిపాలిటీలో వార్డుల పునర్విభజన చేశారు. మిగతా మూడు మున్సిపాలిటీలలో మాత్రం ఎలాంటి మార్పు లేకుండా యథాతథంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు. పరిషత్ ఎన్నికల తర్వాత మున్సిపల్ ఎన్నికలను నిర్వహించేందుకు మున్సిపల్ శాఖ అధికారులు సమాయత్తమవుతున్నారు. అయితే తాండూరు మున్సిపాలిటీలో ఉన్న వార్డులతోనే ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో కొత్తగా ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారికి నిరాశే ఎదురవుతోంది.

85,063 మంది జనాభా

తాండూరు మున్సిపల్ పరిధి 29.9 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. మున్సిపాలిటీలో 16,309 గృహాలున్నాయి. 2019లో జరిగిన మున్సిపల్ పునర్విభజనలో 36 వార్డులు ఏర్పడ్డాయి. శివారు ప్రాంతాలు మున్సిపాలిటీలోకి విలీనం అయ్యాయి. మొత్తం జనాభా 85,063 మంది ఉండగా అందులో పురుషులు 41,504 మంది 43,559 మంది మహిళలున్నారు. అయితే ఓటరు జాబితా ప్రకారం మున్సిపాలిటీలో పురుషులు 31,677 మంది ఓటర్లు, మహిళలు 32,508 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లు 64,185 మంది ఓటర్లు మున్సిపల్ పరిధిలో ఉన్నారు.

వార్డుల్లో మార్పు ఉండదు



మున్సిపల్ పరిధిలో 36 వార్డులున్నాయి. వాటి ప్రకారమే ఓటరు జాబితా సిద్ధం చేశాం. ఇతర మున్సిపాలిటీలలో వార్డుల విభజన చేశారు. కానీ తాండూరులో ఎలాంటి మార్పు చేయడం లేదు. మున్సిపల్ ఎన్నికల కోసం ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేశాం. ఎన్నికల నోటిఫికేషన్ రావడమే తరువాయి.

– విక్రంసింహారెడ్డి, కమిషనర్, తాండూరు

ఏర్పాట్లలో సిబ్బంది

మున్సిపల్ పరిధిలో ప్రస్తుతం ఉన్న వార్డుల్లో ఉన్న ఓటరు జాబితా ప్రకారమే ఎన్నికలను నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. దీంతో వార్డుల విభజన లేనట్లేనని అధికార వర్గాలు పేర్కొన్నాయి. కాగా జిల్లాలో తాండూరు, పరిగి, కొడంగల్, వికారాబాద్ మున్సిపాలిటీలు ఉండగా అందులో మూడింటిలో ప్రస్తుతం ఉన్న వార్డుల ఓటరు జాబితా ప్రకారమే ఎన్నికలను నిర్వహిస్తున్నారు. పరిగి మున్సిపాలిటీలో మాత్రం వార్డుల విభజన చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పదవీకాలం ముగియకముందే మున్సిపాలిటీలకు ఎన్నికలను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసం కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించింది.

తాండూరులో ఓటర్ల వివరాలు	
పురుషులు	31,677
స్త్రీలు	32,508
మొత్తం	64,185